‘రన్‌ఫర్ జీసెస్’ విజయవంతం చేయాలి



బిషప్ తిమోతి కొల్లబత్తుల

మలక్‌పేట: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని ఈ నెల 19న నిర్వహించనున్న రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ ప్రెసిడెంట్, పాస్టర్ బిషప్ తిమోతి కొల్లబత్తుల పిలుపునిచ్చారు. మలక్‌పేటలో ప్రతి ఏడాది మాదిరిగానే రన్‌ఫర్ జీసెస్ నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని చర్చిలకు సంబంధించిన యువత, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. 19న శనివారం ఉదయం 5 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి వద్ద రన్‌ఫర్ జీసెస్ ర్యాలీ ప్రారంభమై దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారం క్రాస్‌రోడ్డ్, మూసారంబాగ్ టీవీటవర్ చౌరస్తా, మలక్‌పేట సూపర్‌బజార్, డీమార్ట్, నల్లగొండ క్రాస్‌రోడ్ మలక్‌పేట ఎంబీ చర్చి, మలక్‌పేట ఫైర్ స్టేషన్, హోరేబు చర్చి, బీ-బ్లాక్ పార్కు, ఎల్‌ఐసీ కాలనీ, సైదాబాద్ బేతేలు చర్చి, సైదాబాద్ ఆర్చ్ మీదుగా ఆస్మాన్‌గఢ్ రాక్ చర్చి వరకు కొనసాగుతుందన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన సేతుమాధవ్ పెద్దకుమారుడు శ్రీరామ్ దంపతులు గత నెలలో అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి కేరళ సందర్శనకు వెళ్లి అక్కడ శ్రీరామ్‌కు గుండెపోటు రావడంతో 5 రోజుల క్రితం చనిపోయాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మురుకుంట్ల అరవింద్ శర్మ, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, మురళీధర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా అయ్యప్ప పూజ



పూజలో పాల్గొన్న బాలకృష్ణగౌడ్, వినోద్

మలక్‌పేట: మన సంస్కృతి, సాంప్రదాయాలు విశిష్టతను చాటిచెప్పాలని గురుస్వామి బాలకృష్ణగౌడ్ అన్నారు. మూసారంబాగ్ డివిజన్ ఇందిరానగర్‌లో వినోద్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్పపూజకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. దీపాలంకరణ, పుష్పాలంకరణతో అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలకృష్ణగౌడ్‌ను సన్మానించారు. పూజల్లో చిట్టంపల్లి కిరణ్‌కుమార్, కాటేపాక బాలేందర్, శివ, శ్రీనివాస్, రాజేష్, స్వామి, వెంకటేష్, ఈశ్వర్, రాజేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



లచ్చిరెడ్డిని సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ ఫేస్-1 కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా కార్యవర్గసభ్యులు మంగళవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిసి తమ కాలనీలోని సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో పురుషోత్తంరెడ్డి, ధనరాజ్, రాములు, నవీన్‌కుమార్, రవికిరణ్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హుడాకాంప్లెక్స్: ఉచిత వైద్య శిబిరాలను పరిసర కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని వేంకటేశ్వరకాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు గందు ధనంరెడ్డి కోరారు. మంగళవారం రోడ్ నెం-3లోని కమ్యూనిటీ హాల్‌లో ఓజోన్ ఆస్పత్రి, వన్ విషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా వైద్యుల పర్యవేక్షణలో 240 మందికి కంటి పరీక్షలు, బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. శిబిరంలో డాక్టర్లు అరుణ, భవాని, సంజనలతో పాటు అంజలి, అనీల్, కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనకరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సందీప్, జాయింట్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌యాదవ్, నరేశ్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ!

ఇబ్బందులు పడుతున్న పాదచారులు
పట్టించుకోని అధికారులు

సైదాబాద్: పాదచారుల సౌకర్యార్థం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే నాథులే లేరు. ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్ల పరిధిలోని ప్రధాన, అంతర్గత రహదారులకు ఆనుకొని ఉండే ఫుట్‌పాత్‌లను కొందరు ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటున్నారు. ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ అధికంగా ఉన్న సమయంలోనూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొందరు తమ వాహనాలను ఇబ్బడి ముబ్బడిగా నిలుపుతున్నారు.దీంతో పాదచారులు నడిరోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.



ఐఎస్‌సదన్ రహదారి పక్కన ఫుట్‌పాత్‌లపై వాహనాల పార్కింగ్

కాలనీల్లోనూ..

కాలనీల్లోని అంతర్గత రహదారులకు ఇరువైపులా ఉండే ఫుట్‌పాత్‌లు కనుమరుగవుతున్నాయి. పలువురు దుకాణదారులు తమ దుకాణాల ముందు ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తున్నారు. కాలనీల్లోనూ ఫుట్‌పాత్‌లపై నడిచే పరిస్థితి ఉండటం లేదు. తప్పని పరిస్థితుల్లో పాదచారులు రహదారుల పై నుంచే వెళ్లాల్సి వస్తుంది. కాలనీల్లోని పలు చోట్ల భవన నిర్మాణ పనులు నిర్వహిస్తున్న వారు నిర్మాణానికి అవసరమైన సామగ్రిని ఫుట్‌పాత్‌లపై వేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



లక్ష్మీనగర్‌లో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

అధికారుల మౌనం..

సైదాబాద్ ఏసీపీ చౌరస్తా నుండిచి ఐఎస్‌సదన్ వరకు ఉండే ప్రధాన రహదారి, అలాగే ఐఎస్‌సదన్ చౌరస్తా నుంచి సింగరేణి కాలనీ చౌరస్తా వరకు సాగర్ జాతీయ రహదారి, సైదాబాద్ నుంచి సరూర్‌నగర్ చెరువు, శంకేశ్వరబజార్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు ఉన్న ప్రధాన రహదారుల ఇరువైపులా ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఆపరేషన్ రోప్ పేరుతో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల ఆక్రమణలు తొలగించినా కొన్ని రోజులకు పరిస్థితి మళ్లీ సమస్యకు మొదటికి వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆక్రమిస్తే కఠిన చర్యలు



ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై వాహనాలు పార్కింగ్ చేస్తే సీజ్ చేస్తాం.ఆపరేషన్ రోప్ సమయంలో పలు చోట్ల ఆక్రమణలు తొలగించాం. మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

-నర్సింహా నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అక్రమ పార్కింగ్..

కాలనీలు, ప్రధాన రహదారులకు ఉన్న ఫుట్‌పాత్‌లు అలంకారప్రాయంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల నుంచి ప్రధాన రహదారులపైకి వచ్చే పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, చిన్నారులకు ఫుట్‌పాత్‌లపై నిత్యం నడుచుకుంటూ వెళ్తుంటారు. చాలాచోట్ల ఫుట్‌పాత్‌లు అక్రమ పార్కింగ్, ఆక్రమణల కారణంగా పాదచారులు ఉపయోగించే పరిస్థితి ఉండటం లేదు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకొని ఫుట్‌పాత్‌లు వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



చాదర్‌ఘాట్: మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న రౌడీషీటర్‌ను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. కమిషనర్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేటకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ అలియాస్ కాలా ఇమ్రాన్ (32) చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో రౌడీషీటర్ నమోదైంది. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అతడిపై 2015లో పీడీ యాక్ట్ నమోదైంది. ఓల్డ్‌మలక్‌పేటలో పాన్ షాప్ నడుపుతున్నాడు. మత్తుకు అలవాటు పడిన అతను మొదట్లో మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లు ఉపయోగించేవాడు. అనంతరం వాటితో పాటు ఆల్ప్రాజోలం టాబ్లెట్లు, గంజాయిని కొనుగోలు చేసి ఓల్డ్‌మలక్‌పేట వాహెద్‌నగర్‌లోని మహారాజా హోటల్ వద్ద వినియోగదారులకు విక్రయించేవాడు. సమాచారం అందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, చాదర్‌ఘాట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రూ. 2 లక్షల విలువ చేసే 10 వైల్స్ మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లు, 60 ఆల్ప్రాజోలం టాబ్లెట్లు, 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

పార్కులో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయిస్తా



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ఆటోనగర్‌లోని డీర్ పార్క్‌కు వచ్చే వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు మంగళవారం ఆయన డీర్‌పార్కును సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పార్కు ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై ఉన్న అనధికార వ్యాపారాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగించేలా చర్యలు చేపడుతానన్నారు. పార్కులో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, భీమిడి వెంకట్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, విజేందర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

- సహారాస్టేట్స్‌కాలనీ సీనియర్ సిటీజన్ ఫోరం ఆధ్వర్యంలో సహారా రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు.

సీనియర్ సిటిజన్ల సేవలు వినియోగించుకోవాలి

మన్సూరాబాద్: వివిధ రంగాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన సీనియర్ సిటిజన్ల సేవలను ప్రభుత్వాలు వినియోగించుకోవాలని మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి సూచించారు. డివిజన్ పరిధి ప్రగతినగర్ కాలనీలోని ఆదర్శ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో సీనియర్స్ సిటిజన్స్ పాత్ర ఎంతో కీలకమైందని, ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆదర్శ సీనియర్ సిటీటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, సభ్యులు సోమిరెడ్డి, అమృతరెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొప్పుల విఠల్‌రెడ్డి

పూజల పేరుతో మోసం

రూ.7.40 లక్షలు కాజేసిన నకిలీ బాబా

నాగోలు: ఇంట్లో సమస్యలు ఉన్నాయి వాటిని పరిష్కరిస్తానని ఓ మహిళను నకిలీ బాబా నమ్మించి పూజల పేరుతో రూ. 7.40 లక్షల కాజేసిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. సాయినగర్ రోడ్డు నెంబర్-3లో నివాసముండే అనూష 2024 డిసెంబర్‌లో జాతకాలు చెబుతామని మీ ఇంట్లో ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరిస్తామని తమ ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి(నకిలీ బాబా) తమకు రెండు మూడు ఘటనలు చెప్పి నమ్మించడంతో అతడికి రూ. 1500 వేలు ఇచ్చింది. మీ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పడంతో వాటిని పరిష్కరిస్తానని ఫోన్ నంబర్ తీసుకొని వెళ్లాడు. కొన్ని రోజుల తర్వాత సదరు వ్యక్తి ఫోన్ చేసి మీ ఇంట్లో నీ పిల్లలు, భర్తకు కూడా బాగోలేదని సమస్యలు ఉన్నాయని వాటిని సరి చేయడానికి డబ్బు ఖర్చవుతుందని చెప్పడంతో ఆమె ఫోన్ పే ద్వారా రూ.35 వేలు పంపింది. మళ్లీ మూడ్రోజుల తర్వాత పూజ పనిచేయదని మళ్లీ చేయాలని రూ. 2.70 లక్షల ఖర్చు అవుతుందని చెప్పడంతో సాయినగర్‌లోని లక్కీ రెస్టారెంట్ వద్దకు అతడు పంపిన వ్యక్తి ముట్ట చెప్పినట్లు తెలిపారు. బాధితురాలు ఆమె ఖాతా నుంచే కాకుండా ఇతరుల ఖాతా నుంచి ఆ నకిలీ బాబాకు లక్ష పదిహేను వేల ఫోన్ పే ల ద్వారా పంపినట్లు తెలిపారు. ఇలా పలు దఫాలుగా రూ.7.40 లక్షలు బాధితురాలు ముట్టజెప్పింది. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు రెండ్రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

బడంగ్‌పేట్: భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ నుంచి మంగళవారం జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. భారత స్వతంత్ర్యాన్ని సిద్ధింపజేసిన జాతిపిత మహాత్మాగాంధీ, అలాగే దేశానికి రాజ్యాంగాన్ని రచించి భారతరత్న బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలను చేతబూనిన నాయకులు కాలనీలు, వీధులు, ఇంటింటికీ తిరుగుతూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని విలువలు ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కొన్ని శక్తులు రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నారని, ఎట్టి పరిస్థితిల్లో మనందరం ఐక్యంగా ఉండి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉద్యమంలో భాగస్వాములమవుదామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వంటేటి ప్రభాకర్‌రెడ్డి, సామ ప్రభాకరెడ్డి, గట్టు బాలకృష్ణ, నవారు మల్లారెడ్డి, సుభాష్‌యాదవ్, బి.జంగయ్య, ఉమేశ్, రవికాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నానని కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. శ్రీరాంకాలనీ కార్గో రోడ్డుపై గత కొన్ని రోజులుగా మురుగునీరు పారుతున్న విషయమై స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని నీరు నిలిచిపోవడానికి గల కారణాలు గుర్తించారు. అవుట్ లెట్ సాఫీగా వెళ్లకుండా వ్యర్థాలు పేరుకుపోవడంతో పాటు కొందరు వ్యాపారుల వస్తువులు అడ్డుగా పెట్టినందుకే సమస్య తలెత్తిందని గుర్తించారు. వెంటనే సిబ్బందిని పెట్టి వ్యర్థాలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికి వాడలు అధికంగా ఉన్న ఈ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రతన్, పర్యావరణాధికారి ఎం.శ్రీను, సూపర్‌వైజర్ కుమార్ పాల్గొన్నారు.

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతు బజార్‌కు ప్రతి నెల మూడో బుధవారం సెలవు ఉండటంతో నేడు ఎలాంటి క్రయ విక్రయాలు జరగవని ఈఓ స్రవంతి తెలిపారు. గురువారం యథావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బ్రహ్మమురళిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, మదన్‌మోహన్‌రెడ్డి, రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

వాటర్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలి

మన్సూరాబాద్: వేసవిలో తాగునీటిని సక్రమంగా విడుదల చేయకుండా విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న జలమండలి ఉద్యోగి వాటర్‌మెన్ రవిపై చర్యలు తీసుకోవాలని శ్రీరామ్ నగర్‌కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా కాలనీలో తాగునీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని, జలమండలి ఉద్యోగి రవి విధులను నిర్లక్ష్యం చేస్తూ నీటి సరఫరా చేస్తున్నారన్నారు. జలమండలి ఉన్నతాధికారులు స్పందించి వాటర్‌మెన్‌పై చర్యలు చేపట్టి, నీటి సరఫరాను మెరుగుపర్చాలని కోరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల ఉపేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కొండవీటి మోహన్‌రెడ్డి, యుగంధర్, ఆచారి బాలమురళీ, మూల మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించి వాహనాలు తీసుకెళ్లండి

నాగోలు: ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ రకాల ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులలో పట్టుబడిన 55 వాహనాల యజమానులు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వచ్చి సరైన వాహన పత్రాలు చూపించి వాటిపై ఉన్న పెండింగ్‌లో ఉన్న చలాన్లు చెల్లించి తీసుకెళ్లాని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ రకాల ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులలో పట్టుబడ్డాయి. సదరు వాహన యజమానులకు ఇప్పటి వరకు పోస్ట్ ద్వారా నోటీసులు ఇవ్వడంతో పాటు సమాచారం కూడా ఇచ్చామని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్కరూ ముందుకు వచ్చి పైన తెలుపబడిన వారి వాహనాలను తీసుకెళ్ల లేదని అన్నారు. రాని పక్షంలో చట్ట ప్రకారం నిబంధనల మేరకు వేలం వేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వాహన యజమానులు ఇప్పటికై ఇతర సమాచారం కోసం 87126 62773లో సంప్రదించగలరని ఆయన సూచించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



బాధితులను పరామర్శిస్తున్న వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: విద్యుదాఘాతంలో ఇల్లు దగ్ధమైన ఘటన ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతంలో చోటు చేసుకుంది. ఇస్లావత్ రమేష్ కుటుంబం మంగళవారం పనులపై బయటకు వెళ్లారు. మధ్యాహ్నం హఠాత్తుగా వారి ఇంట్లో నుంచి మంటలు రావడం గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే గృహోపకరణాలు అగ్నికి దగ్ధమయ్యాయి. అల్మారాలో కొంత నగదు, బంగారం దగ్ధమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం అందుకున్న బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బుధవారం స్థానిక కార్పొరేటర్, సైదాబాద్ మండలం తహసీల్దార్‌ను బాధితులతో కలిసి ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ

చైతన్యపురి: తెలంగాణ ఉద్యమకారుల పోరాట పటిమ, న్యాయమైన అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తి చర్చించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 21న సికింద్రబాద్ జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాల్లో జరిగే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం ప్లీనరీ సమావేశానికి సంబంధించి వాల్‌పోస్టను మంగళవారం ఆయన ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి నరేందర్‌గౌడ్, కన్వీనర్ దుగ్గాణి శ్యామల, తుర్కయంజాల్ మున్సిపాలిటి ఫోరం అధ్యక్షుడు అందెకార్ బాబూలాల్‌తో కలిసి ఆవిష్కరించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



చిన్నపాటి వర్షం.. కాలనీలు వరదమయం

చిన్నపాటి వర్షానికే దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో వరద పారింది. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, చంచల్‌గూడ, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, మాదన్నపేట్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం చిన్నపాటి చినుకులు కురవడంతో ఆయా ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. ఈ వర్షానికే తమ కాలనీల్లో వరద పారితే వర్షాకాలంలో మా పరిస్థితి ఏంటని స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

-దిల్‌సుఖ్‌నగర్

కాలనీలో కబ్జాలు లేవు

విచారణ చేయాలని కమిషనర్‌కు వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లోని ఎంసీఆర్ కాలనీలో ఇంచు భూమి కూడా కబ్జా కాలేదని ఆ కాలనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బడంగ్‌పేట కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో ఉన్న పార్కులు యథావిధిగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ భూమి అసలే లేదన్నారు. కొందరు వ్యక్తులు ఎంసీఆర్ కాలనీని బదునాం చేసేందుకు పూనుకున్నారని ఆరోపించారు. అవగాహన లేని వ్యక్తుల వల్ల తమ కాలనీ పేరు అప్రతిష్ఠపాలు అవుతుందని వాపోయారు. కాలనీలో స్థలాలు కబ్జాకు గురైతే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అరుణ్‌గౌడ్, కార్యదర్శి నర్సింగ్‌నాయక్, కోశాధికారి దివ్య, యూత్ ప్రెసిడెంట్ వివేక్, మెంబర్లు శ్రీకాంత్, సాయిరాం, జైరాం, నరేష్, చందునాయక్, సికిందర్, సురేష్, సాయితేజ, శ్రీనివాస్, హర్ష, వేణు, హరినాయక్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంసీఆర్ కాలనీవాసులు

సేఫ్ నైబర్‌హుడ్ అవార్డుల ప్రదానం



ఇన్‌స్పెక్టర్ సురేందర్‌ను అభినందిస్తున్న పోలీసు సిబ్బంది

చార్మినార్: సేఫ్ నైబర్‌హుడ్ అవార్డు అందుకున్న హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సురేందర్‌ను స్టేషన్ ఎస్‌ఐలతో పాటు ఇతర పోలీసు సిబ్బంది బొకే అందజేసి అభినందించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చేతుల మీదుగా ఆయన మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో దక్షిణ మండలంలోని 12 పోలీస్‌స్టేషన్లకు గాను.. హుస్సేనీఆలం పోలీసు స్టేషన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుధీర్, నవీన్, నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డికి..

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డికి సేఫ్ నైబర్‌హుడ్ అవార్డు లభించింది. తాజ్ డెక్కన్‌లోని హెచ్‌సీపీ హెచ్‌ఎస్‌సీ స్త్రీ సమ్మిట్-2లో కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ చేతుల మీదుగా సేఫ్ నైబర్‌హుడ్ అవార్డును అందుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి అవార్డును అందుకోవడంపై స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



అవార్డును అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి